ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
బుధవారం | 23 సెప్టెంబరు, 2026 | పేజీలు :08

## శాంతియుతంగా వినాయక నిమజ్జనాలు



కలెక్టర్ సత్యప్రసాద్

2 లో

# రూ. 70 కోట్లతో నియోజకవర్గంలో..
# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

### విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ సర్కార్ : రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో 70 కోట్లతో నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలను అన్ని విధాల అభివృద్ధి చేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు అన్నారు.మంగళవారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్పాహార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు గ్రామ సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్ ఇతర నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని ఆరగించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా తెలంగాణ అల్పాహార కార్యక్రమం మరింత విస్తరిస్తోంది అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాలలో అల్పాహార కార్యక్రమాన్ని విద్యార్థిని విద్యార్థులకు అందిస్తామని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఉదయాన్నే వ్యవసాయ, ఇతర పనులకు వెళ్లిపోతుండటంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందించే విషయంలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు.వారానికి ఆరు రోజుల పాటు ఇడ్లీ సాంబార్, పూరీ ఆలూ కుర్మా, దోస, ఉప్మా,మిల్లెట్ బోండా తదితర అల్పాహారం తోపాటు పాలు,రాగి జావా అందిస్తున్నట్లు వివరించారు.పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.70 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వ విప్ విజయరమణ రావు తెలిపారు.కాంపౌండ్ వాల్స్, నూతన పాఠశాల భవనాలు,మరుగుదొడ్లు, భవనాల ఆధునీకరణతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో



తరువాయి 2లో

## ఘనంగా ప్రారంభమైన గణేష్ నిమజ్జనోత్సవం

### జిల్లా ఎస్‌పి జానకి షర్మిల



**ప్రజా పక్షం/భైంసా :** భైంసా పట్టణంలో గణేష్ నిమజ్జనోత్సవం ఘనంగా ప్రారంభమైంది. గడ్డెన్న వాగు ప్రాజెక్టు నిమజ్జన ప్రదేశంలో క్రేన్ సహాయంతో తొలి గణపతిని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,ఐపిఎస్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్తో కలిసి నిమజ్జనం చేసి ఉత్సవాలను ప్రారంభించారు.నిమజ్జనోత్సవం ప్రశాంతంగా,ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మొత్తం 700 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.అదనపు ఎస్పీ,14 మంది డీఎస్పీలు,18 మంది సీఐలు, ఎస్సైలు ఇతర పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు.100కు పైగా సీసీ కెమెరాలు, 2 డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు.అడిషనల్ ఎస్పి రాజేష్ మీనా,ఐపిఎస్, భైంసా ఎఎస్పి సాయి కుమార్, ఐపిఎస్, భైంసా అదనపు కలెక్టర్ అజ్మీరా సాకేత్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రేయ,పాల్గొన్నారు.

## మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలు సాగు



కలెక్టర్ గరిమా అగర్వాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రైతులు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్ద బోనాలలో రైతు కాశెట్టి మల్లయ్య ఎల్‌నినో ప్రభావంతో వరి సాగును వదిలి దాదాపు నాలుగు ఎకరాల్లో వంకాయ, మిరప, కాకరకాయ సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆ కూరగాయల తోటను జిల్లా కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వంకాయ దిగుబడి వస్తుండగా

2 లో

## వేములవాడలో గణేష్ నిమజ్జనోత్సవానికి
# భద్రతా ఏర్పాట్లు పూర్తి

### 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట భద్రత,శోభాయాత్రలో డిజే లకు అనుమతి లేదు

**ప్రజా పక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఆలయ గుడి చెరువు వద్ద ఏర్పాట్లను మంగళవారం రోజున క్షేత్రస్థాయిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పరిశీలించారు. వేములవాడ పట్టణ పరిధిలో సుమారు 320 గణేష్ మండపాల్లో గణనాథులు కొలువుదీరగా, బుధవారం నిర్వహించనున్న గణేష్ నిమజ్జనం, శోభాయాత్రను “జీరో యాక్సిడెంట్ – జీరో ఇన్సిడెంట్” లక్ష్యంతో ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్‌పి మహేష్ బి. గితే తెలిపారు. నిమజ్జనం సందర్భంగా 200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్లు తదితర భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పికెట్లు, పుష్షింగ్ పార్టీలను ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షణ



తరువాయి 2లో...

## పాత డిగ్రీ కళాశాలను సందర్శించిన

### ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి రాంబాబు

**ప్రజాపక్షం / జమ్మికుంట :** పాత ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. భవనం చెక్కు చెదరని స్థితిలో ఉన్నా కూడా దీనిని ఎందుకు మూసివేశారని ప్రశ్నించారు. తెలంగాణ స్టేట్ ఎస్ఎఫ్ఐ సీవో కన్వీనర్ గోస్కుల అజయ్, జమ్మికుంట నగర కార్యదర్శి బోగం శశాంక్, రోహిత్, ఆఫ్రిద్, మోయిన్, సల్మాన్, రిషికేశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నవరాత్రోత్సవాలు

**ప్రజాపక్షం / చొప్పదండి :** సాయిబాబా మందిరంలో శ్రీ విఘ్నేశ్వర నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో 108 రకాల ప్రసాదాలతో ప్రత్యేక పూజలు, దీపారాధన కార్యక్రమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నలుమాచు కాశీనాథం, తిక్క శివశంకర్, కొత్తపల్లి శ్రీనివాస్, మహిళా సేవా సమితి సభ్యులు దండె లావణ్య, కటకం రమాదేవి, దూస లావణ్య, జమున, పిట్టల పద్మావతి, దూస అరుణ, తాటికొండ స్వప్న, కొత్తపల్లి మంజుల తదితరులు పాల్గొన్నారు.

## అక్షయ స్కూల్లో ఘనంగా నిమజ్జనం

**ప్రజాపక్షం / ఆర్నకొండ :** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్నకొండలోని అక్షయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కోలాటాలు, భక్తి నృత్యాలు చేస్తూ భజన పాటలు పాడుతూ భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా ఊరేగింపుగా వినాయకుడిని తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ తమ్మిడి కనకరాజు, ప్రిన్సిపల్ తమ్మిడి శ్రీమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**కొత్తపల్లి :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కరీంనగర్ పోలీస్ హెడ్క్వార్టర్స్లో ప్రతిష్ఠించిన గణనాధునికి ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్గొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయని ప్రజలందరూ ఉత్సవాలను సంతోషకరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సీపీ గౌష్ ఆలం ఆకాంక్షించారు.

## రాష్ట్రస్థాయి ఉషు క్రీడల్లో సాన్వీ విద్యార్థుల జయకేతనం

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** ఈనెల 19, 20వ తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి 4వ ఉషు క్రీడ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరపున పాల్గొన్న కరీంనగర్ రేకుర్తి సాన్వీ కళాశాల డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు. పలు విభాగాలలో పోటీపడి కరీంనగర్ జిల్లాను ఓవరాల్ ఛాంపియన్గా నిలిపారు. తెలంగాణ రాష్ట్రం తరపున సాన్వీ కళాశాల కరీంనగర్కు చెందిన విద్యార్థులు మహిమారాణి, భానుశ్రీ, నిశాంత్, సాయిచరణ్, వేదవ్యాస్, ఆత్రేయలు ఎంపికయ్యారని తెలిపారు.

# లంచం అడిగితే సమాచారం ఇవ్వాలి

### విజిలెన్స్ అధికారి డి.నాగరాజు



**ప్రజాపక్షం / గంగాధర :** తెలంగాణ హౌసింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ విజిలెన్స్ అధికారి, రిటైర్డ్ ఎస్పీ డి.నాగరాజు కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఒద్యారం గ్రామాన్ని సందర్శించారు. గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుడు చేసిన లంచం ఫిర్యాదు నేపథ్యంలో ఆయన గ్రామంలో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి లబ్ధిదారులను నేరుగా కలుసుకొని వివరాలు సేకరించారు. గృహ నిర్మాణ పథకం కింద అందుతున్న ప్రయోజనాలు, చెల్లింపుల ప్రక్రియపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. చెల్లింపులు పొందేందుకు ఎవరైనా లంచం డిమాండ్ చేశారా? డబ్బులు ఇవ్వాలని ఎవరైనా ఒత్తిడి చేశారా? అనే అంశాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా డి. నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పూర్తి పారదర్శకతతో అమలు కావాలని లబ్ధిదారులు ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని అన్నారు. పథకం కింద చెల్లింపులు పొందే ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. చెల్లింపుల కోసం మంజూరు కోసం ఎవరినీ ఆశ్రయించాల్సిన అవసరం లేదని ఎవరైనా లంచం అడిగితే పథకం అమలులు ఇబ్బందులకు గురిచేసినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# పకడ్బందీగా గణేశుడి నిమజ్జనం చేపట్టాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** గణేశుడి నిమజ్జనానికి ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని కొత్తపల్లిచెరువు, చింతకుంట కాల్వ వద్ద నిమజ్జనం ఏర్పాట్లను కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులు విధిగా నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశం వద్ద లైటింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. అధికారులు సమన్వయం చేసుకొని భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కొత్తపల్లి చెరువు రెండు పాయింట్ల వద్ద నిమజ్జనం నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. చిన్న ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు రెండో పాయింట్ను వినియోగించాలని సూచించారు. నిమజ్జన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, మున్సిపల్ శాఖ అధికారులు పలు సూచనలు చేశారు, ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కెటిఆర్ నీ పతనం 30నుంచి మొదలు

### రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** కేటీఆర్ నీ పతనం ఈనెల 30 నుంచి మొదలు కాబోతుందని రేవంత్ రెడ్డి సభ సిరిసిల్లలో ఉండబోతే కేటీఆర్ వెన్నులో వణుకు పుడుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. ఈనెల 30న సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అధ్యక్షతన సిరిసిల్ల కె కన్వెన్షన్ హాల్లో నాయకులతో కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేసి మాట్లాడారు. భారీ బహిరంగ సభను లక్ష మందితో నిర్వహిస్తున్నామని ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు భవిష్యత్లో ప్రజాపాలన ఇందిరమ్మ రాజ్యాన్ని కొనసాగించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. సిరిసిల్ల లో రేవంత్ రెడ్డి సభ ప్రకటనతో బిఆర్ఎస్ల ఆందోళన మొదలైందని విప్ అన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల చేనేత రంగానికి, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టులకు, జిల్లా అభివృద్ధికి చేసిన కృషిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ రాజన్న సన్నిధికి వచ్చి గతంలో ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### సభా స్థలిని పరిశీలించిన విప్

సన్నాహక సమావేశం అనంతరం ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎస్పీ మహేశ్ బి.గితే తో కలిసి సీఎం సభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చే అవకాసం ఉన్నందును ఏర్పాట్లు భద్రత, పార్కింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కేకే మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ప్రకాశ్ పాల్గొన్నారు.

## రేపటి నుంచి దోస్త్ స్పాట్ అడ్మిషన్లు

### -ఎస్సారార్ కళాశాల్లో 53 సీట్లు ఖాళీ

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** 2026–27 విద్యా సంవత్సరానికి డిగ్రీలో ప్రవేశాల కోసం ఉన్నత విద్యామండలి చివరి విడత దోస్త్ స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల చేసింది. ఈమేరకు కరీంనగర్ లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వివిధ కోర్సుల్లో మిగిలిన 53 సీట్ల భర్తీకి ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ, సమన్వయకర్తలు డా.కె.సురేందర్ రెడ్డి, డా.ఆర్.రామకృష్ణ తెలిపారు. సెప్టెంబర్ 23న కళాశాల నోటీస్ బోర్డు, వెబ్సైట్లో ఖాళీల వివరాలను పొందుపరుస్తామని, సెప్టెంబర్ 24, 25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు ఎక్కడా అడ్మిషన్ పొందని విద్యార్థులు మాత్రమే అర్హులని, ఇందుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.425 చెల్లించాలన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్ మార్కుల మెమోలు, టీసీ-స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్తోపాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులతో స్పాట్ అడ్మిషన్కు హాజరు కావాలన్నారు.

## శాతవాహనలో అనలిటికల్ మెథడ్స్పై కార్యశాల

**ప్రజాపక్షం / కరీంనగర్ రూరల్ :** శాతవాహన విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హాండ్స్ ఆన్ ఎక్స్పీరియన్స్ ఇన్ అనలిటికల్ మెథడ్స్ అనే అంశంపై రెండు రోజుల కార్యశాల విశ్వవిద్యాలయ డా.బి.ఆర్.అంబేద్కర్ లైబ్రరీ ఆడిటోరియంలో ప్రారంభమైంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అభివృద్ధి కోసం చేపట్టిన అకాడమిక్ ఎంపవర్మెంట్ ప్రోగ్రామ్100 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఈ కార్యశాల ఏర్పాటు చేయగా సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్.రమాకాంత్ అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులకు ప్రయోగాత్మక విశ్లేషణ పద్ధతులపై పరిజ్ఞానం ఎంతగానో అవసరమని రసాయన శాస్త్రంలో విభిన్న పరిశోధనలకు ఈ కార్యశాల ఎంతో ఉపయోగపడాలన్నారు.

## శాంతియుతంగా వినాయక నిమజ్జనాలు

**ప్రజాపక్షం /రాయికల్ :** రాయికల్ పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని, అధికారులు వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.రాయికల్ పట్టణ శివారులోని వాగు వద్ద వినాయక నిమజ్జన వేడుకల కోసం మున్సిపల్, పోలీస్,రెవెన్యూ, అగ్నిమాపక ఇతర శాఖల ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్,ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి పరిశీలించారు.పట్టణ వాసులతో పాటు భక్తులు, పిల్లలు తరలివచ్చే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనం వేడుకలు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీవో మధుసూదన్,డిఎస్పీ పురుషోత్తం రెడ్డి,మున్సిపల్ కమిషనర్,తహసీల్దార్, ఎంపిడివో,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రూ. 70 కోట్లతో నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేట్ పాఠశాలల నుంచి కూడా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభమై వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఏడాది కాలంలో పనులు పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థు ల హాస్టళ్లను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసి,అందరికీ సమాన విద్య అందించే లా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులకు అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గ్రామ సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్,మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ,సింగిల్ విండో చైర్మన్ జానీ వైస్ చైర్మన్ బండారి రమేష్,పడాల అజయ్ గౌడ్,పన్నాల రాములు,సాయిరి మహేందర్,ధన నాయక్ దామోదర్,పలు గ్రామాల సర్పంచ్లు,ఉపసర్పంచ్లు,గ్రామపంచాయతీ పాలక వర్గం,ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు,విద్యార్థులు, పాల్గొన్నారు.

## వేములవాడలో గణేష్ నిమజ్జనోత్సవానికి భద్రతా ఏర్పాట్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. మండపాల నిర్వాహకులు నిర్దేశించిన సమయానికి శాంతియుత వాతావరణంలో నిమజ్జనం పూర్తి అయ్యేలా, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలకు అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని, ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా శాంతియుత వాతావరణంలో శోభయాత్ర సాగేలా సహకరించాలని కోరారు. నిమజ్జనం రోజున ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదు. శోభాయాత్రలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన పోలీస్ వారికి సమాచారం అందించాలి. శోభాయాత్ర సందర్భంగా పాల్గొనే భక్తులకు, ముఖ్యంగా మహిళలు మరియు చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కోరారు.

## మార్కెట్ డిమాండ్కు అనుగుణంగా పంటలు సాగు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ పరిశీలించి ఆ రైతులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంప్రదాయంగా సాగు చేస్తున్న వరిని వదిలి వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం వంకాయ దిగుబడి వస్తుందని వివరించారు. వంకాయ మొక్కలు నాటిన 45 రోజులు నుంచి దిగుబడి మొదలై దాదాపు ఆరు నెలల వరకు ప్రతి వారం పంట చేతికి వస్తుందని వెల్లడించారు. అన్ని ఖర్చులు పోను ఏడాదికి రెండు లక్షలకు పైగా ఆదాయం వస్తుందని రైతు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎలనినో ప్రభావంతో రైతులు ఉద్యానవన అధికారుల సూచన మేరకు కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్ ఫామ్ ఇతర పంటలు సాగు చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సబ్సిడీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**జిల్లా మహిళా సమాఖ్య భవనాన్ని పరిశీలించిన కలెక్టర్**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెడికల్ కళాశాల సమీపంలో జిల్లా ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ మంగళవారం పరిశీలించారు. భవనం బయట, లోపల వివిధ కార్యాలయాలు, డార్మిటరీ, కిచెన్, మీటింగ్ హాల్ తదితర పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

## మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ

### కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం నవాబుపేట గ్రామంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం ముగిసింది. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సౌజన్యంతో గత మే నెలలో అలీఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణను పూర్తి చేసిన మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లె రామ్మూర్తి, , నాగేపల్లి మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య,ఎరుకల బాబురావు, నవాబుపేట ఉప్ప సర్పంచ్లావణ్య రాజ్ కుమార్,నవాబుపేట గ్రామ శాఖ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు ఇమ్మడిశెట్టి సారయ్య,నవాబుపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యువకులు,ప్రజలుపాల్గొన్నారు.

## మట్టి విగ్రహాల వినియోగం అభినందనీయం

**ప్రజాపక్షం/రామగిరి :** కల్వచర్ల గ్రామంలోని గోకుల్ నగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఆర్జీ త్రీ జీఎం సుంకర మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై మట్టి గణపతిని దర్శించుకున్నారు.వీరితో పాటు అధితులుగా ఎస్టేట్ డీవైజీఎం ఐలయ్య,సివిల్ సూపర్వైజర్,కల్వచర్ల ఉపసర్పంచ్ కస్పా మహేందర్ తదితరులు పాల్గొని మట్టి గణపతిని దర్శించుకున్నారు.గోకుల్ నగర్ యాదవ సంఘం కమిటీ సభ్యులు ప్రముఖ అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించి, గణపతి చిత్రపటాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు.

## తెలియని వారి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

### షీ టీం ఇన్చార్జి ఎస్ఐ లావణ్య, షీ టీమ్ మెంబర్ స్నేహలత

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** విద్యార్థిని విద్యార్థులు పరిచయం లేని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ ఇంచార్జ్ ఎస్సై లావణ్య, షీ టీమ్ మెంబర్ స్నేహలత అన్నారు.రామగుండం సి. పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో పెద్దపెల్లి షీ టీమ్ వారు సుల్తానాబాద్ మండలం,గర్రెపల్లి గ్రామం లోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ, గుడ్ టచ్ బాడ్ టచ్, గురించి విద్యార్థులు తెలియని వారి పట్ల ఎలా ఉండాలి,పోక్సో యాక్ట్ గురించి విద్యార్థులకు వివరించారు. సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు.మహిళల భద్రత,ఆన్లైన్ మోసాలపై,యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్,ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని,ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో హెడ్ మాస్టర్ అశోక్,ఉపాధ్యాయులు షీ టీమ్ సభ్యులు,మౌనిక పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్

**ప్రజా పక్షం/సుల్తానాబాద్ :** నియమనిష్టలతో నవరాత్రులు పూజలు అందుకున్నటువంటి వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతకరమైన వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి సుల్తానాబాద్ పట్టణంలోని ఊర చెరువు వద్ద వినాయక నిమర్జనం ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం విజయ రమణారావు మాట్లాడుతూ నిమజ్జనం ప్రశాంతకరమైన వాతావరణంలో జరిగే విధంగా పటిష్ట ఏర్పాట్లు చేయడం జరిగిందని సూచించారు.నిమజ్జనానికి వచ్చే ఉత్సవ కమిటీ వారు పోలీసు వారి సూచనలు నియమ నిబంధనలను పాటించాలని అన్నారు. భక్తుల సౌకర్యార్థం నిమర్జనం చేసే ప్రదేశంలో గజ ఈతగాళ్లతోపాటు, మెడికల్ ఆఫీసర్స్, పోలీస్ సిబ్బంది ఇతరత్రా ఏర్పాట్లను చేయడం జరిగిందని



అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధా కృష్ణ,మున్సిపల్ కమిషనర్ రమేష్ తో పాటు కౌన్సిలర్లు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పదవి కంటే ప్రజా శ్రేయస్సు ముఖ్యమంటున్న బిజెపి నాయకుడు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ప్రజల అవసరాలు తీర్చి ప్రజలకు నిత్యం సేవ చేయడానికి ఎలాంటి పదవులు అవసరం లేదని బిజెపి టౌన్ ప్రెసిడెంట్ కూకట్ల నాగరాజు నిరూపించారు.సుల్తానాబాద్ పట్టణంలోనిమున్సిపాలిటీ 2వవార్డ్ పరిధిలోని సెయింట్ మేరీస్ స్కూల్ వెనుక వైపున ఉన్నటువంటి పంట పొలాలకు విద్యుత్ సరఫరా అయ్యే ట్రాన్స్ఫారం చుట్టూ పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి విద్యుత్ అంతరాయం ఏర్పడడమే కాక ప్రమాద భరితంగా మారింది.ట్రాన్స్ఫారం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కల వలన విద్యుత్ సరఫరాకు నిత్యం అంతరాయం కలిగి మోటార్లు కాలిపోవడం,పంటలకు నీరు అందక రైతులు తీవ్రంగా ఇబ్బంది గురికావలసి వస్తున్నది అని గమనించిన బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ కూకట్ల నాగరాజు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి వారి సహకారంతో ట్రాన్స్ఫర్ చుట్టూ స్వయంగా పిచ్చి మొక్కలు తొలగించి గడ్డి మందు



పిచికారి చేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి పదవులతో పనిలేదని నిత్యం తాను నమ్ముకున్న సుల్తానాబాద్ పట్టణ ప్రజా సేవకై పరితపిస్తూ ఉంటానని అన్నారు.కూకట్ల నాగరాజు వెంట సకినాల సుమంత్,ఓజ్జా తిరుపతి,కందునూరి లచ్చయ్య,విద్యుత్ సిబ్బంది దినేష్లు వున్నారు.

## సుల్తానాబాద్‌లో కనువిందు చేసిన కరెన్సీ గణనాథుడు

**ప్రజా పక్షం/సుల్తానాబాద్ :** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని స్వప్న కాలనీలో గల టౌన్ షిప్ లో కరెన్సీ తో అలంకరణ చేసిన గణనాథుడు కనువిందు చేశారు.కాలనీకి చెందిన భక్తులు గణేశుడికి 6 లక్షల 66 వేల ,666 రూపాయల కరెన్సీ తో గణేష్ ని అలంకరించారు.రూ.10, 20,50,100,200,500 ల రూపాయల నోట్ల తో అలంకరించిన ఈ కరెన్సీ గణనాథుడు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కరెన్సీ గణనాధుని చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి తిలకించారు.గణేష్ కమిటీ నిర్వా



హకులు,భక్తులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు రాగిజావ పంపిణీ

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రతిరోజూ ఉచితంగా రాగిజావ అందించే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్, కేర్నెక్స్ మైక్రో సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి హాజరై విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు.73 మంది విద్యార్థులకు యూనిఫార్ములు పట్టణంలోని న్యూ హరిజన వాడ ఎంపీపీఎస్ పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాలకు చెందిన 73 మంది విద్యార్థులకు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ప్రతినిధులు యూనిఫార్మ్ లను మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి చేతులమీదుగా అందజేశారు.జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్,ట్రస్ట్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజా రాజ్ గోపాల్,అధ్యాపకులు,పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా,పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మిగిలిన సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని వేదిక చైర్మన్ కిషన్ తెలిపారు.టెక్నికల్ మెంబర్ చావన్, ఫైనాన్స్ మెంబర్ శ్రీనివాస్,జగిత్యాల జిల్లా సూపరింటెండెంట్ సుదర్శనం ఏడీఈలు, ఏఈలు,విద్యుత్ శాఖ సిబ్బంది,వినియోగదారులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో గర్భిణీకి సురక్షిత ప్రసవం

**ప్రజా పక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన గర్భిణీ ఇ.లావణ్యకు హఠాత్తుగా పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌ను ఆశ్రయించారు.సమాచారం అందిన వెంటనే బీర్ పూర్ 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు బయలుదేరారు.క్లిష్ట సమయంలో చాకచక్యంగా వ్యవహరించి ఇద్దరి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని గ్రామస్తులు,కుటుంబ సభ్యులు అభినందించారు.

## పలు వినాయక మంటపాలను దర్శించుకున్న మాజీమంత్రి కొప్పుల

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మంటలం కేంద్రంలోని పలు మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరులను దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు, స్థానిక ప్రజలకు గణేష్ నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.వినాయకుడి కృపా కటాక్షాలతో మండల ప్రజలందరూ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ లంబోదరుడిని ప్రార్థించారు.కాంపల్లి హన్మాండ్లు,కచ్చు కొమురయ్య,బలభక్తుల కిషన్ ,శ్రీరాములపల్లి సర్పంచ్ శోభన్ ,మారం రాజశేఖర్ ,కనుకుంట్ల లింగారెడ్డి,ఆ వారి చందు,కలకోట సత్యం,కోమల్ల జలంధర్,సామల వీర స్వామి,బిఆర్ఎస్ కార్యకర్తలు, పాల్గొన్నారు .

## తప్పుడు వార్తలు రాసి ప్రచారం చేస్తే కేసులే

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** సోషల్ మీడియాలో విద్వేశాలు,రెచ్చగొట్టు వ్యాఖ్యలు చేస్తే వేటు తప్పదని,తప్పుడు కథనాలు రాసి,విద్వేశాలు కల్పించవద్దని ఎల్లారెడ్డిపేట సీఐ హెచ్చరించారు.మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండురోజుల క్రితం ఓ వర్గం షట్టర్‌పై రాళ్ళు రువ్వారని తప్పుడు ప్రచారం సోషల్‌మీడియాలో రాసి షేర్ చేశారని వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు పెడతామని అన్నారు.చట్టం చేసుకుంటూ పోతుందని అన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని వీర్నపల్లి స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ్ పక్షం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ క్రాం తి కుమార్, ఎంపీడీఓ శ్రీలేఖ, ఎంఇఓ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, మండల మెడికల్ ఆఫీసర్, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, నాగరాణి, ఏఎన్ఎమ్ సుజాత, ఆశలు పాల్గొన్నారు.

## గిద్దె చెరువు మత్తడి పరిశీలన

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని గిద్దె చెరువు మత్తడి దూకే స్థాయి వరకు చేరడంతో జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ ఎనగందుల నర్సింలు, ఉప సర్పంచ్ బందారపు బాల్‌రెడ్డి, ఏఈ భాస్కర్ రెడ్డి, ఈవో కృష్ణతో కలిసి మంగళవారం పరిశీలించారు. నీటి ప్రవాహాన్ని పరిశీలించి పరిస్థితులను సమీక్షించారు. రైతులు ఉన్నారు.

## వినాయక సేవలో చల్మెడ భక్తులకు అన్న ప్రసాద వితరణ

**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.వినాయక ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల్లో ఐక్యత, సేవా భావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. అందరికీ వినాయకుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఆయుర్వేదం

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ పవిత్ర

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఆయుర్వేదంతో ఆరోగ్యకరమైన భవిష్యత్తు పొందవచ్చు అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పవిత్ర అన్నారు. ఈ నెల 23 న జరగబోయే జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ కలెక్టరేట్లో ఆయుర్వేదం, ఆరోగ్యకరమైన జీవనశైలి మార్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రోజువారీ జీవితంలో ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా అనేక జీవనశైలి సంబంధిత సమస్యలను నివారించవచ్చని కార్యక్రమంలో వివరించారు.కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్,ఆర్డిఓ గంగారం, పాల్గొన్నారు.

## ఓడేడులో పెన్షన్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీ పరిధిలో కొత్తగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వెరిఫికేషన్ కార్యక్రమం మంగళవారం జరిగింది.ఈ పెన్షన్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని మండల పరిషత్ అధికారి ప్రవీణ్ కుమార్,గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా పారదర్శకంగా ఈ వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా జి.రవికుమార్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా నూతన మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా జి.రవి కుమార్ మంగళవారం రోజున తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని కోరారు.



## జాతీయ ఆయుర్వేద దినోత్సవం




**ప్రజాపక్షం /రాయికల్ :** అల్లిపూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి గ్రామంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు.ఆయుర్వేద వైద్య విధానం, దాని విశిష్టత మరియు ప్రాచీన జీవనశైలి ప్రాముఖ్యతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలువురు ప్రముఖులు సూచించారు. అనంతరం శారీరక, మానసిక ఆరోగ్యం కోసం యోగా శిక్షకుల పర్యవేక్షణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సూర్యనమస్కారాలు మరియు ప్రాణాయామం సాధన చేశారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. సునీత, గ్రామ సర్పంచ్ గౌతమివెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్, ఫార్మాసిస్ట్ జ్యోతి, ఆశ వర్కర్ లక్ష్మి యోగా శిక్షకులు లింగమూర్తి, శ్రీధర్, సమత, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంపై అవగాహన



**ప్రజాపక్షం/మల్యాలః** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ తాళ్ల శోభారాణి పిల్లలు,తల్లులకు ఆరోగ్యకరమైన, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు.పిల్లల ఎదుగుదలకు సమతుల్య ఆహారం,పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల ప్రాధాన్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌తో పాటు పిల్లలు,తల్లులు,తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతంపై అవగాహన



ప్రజాపక్షం/ మల్లాపూర్ ః మల్లాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఓబులాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సంఘ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ మేరకు డాక్టర్ ఎస్ కవి రాజు, ఎస్.కె మునీర్ హాజరై రైతులకు అవగాహన కల్పించారు.డాక్టర్ ఎస్ కవి రాజు, మునీర్ మాట్లాడుతూ కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పిఎసిఎస్ సంఘాల బలోపేతానికి చేపడుతున్న వ్యాపార వైవిధ్యాలను సభ్యులకు వివరించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పాదం భూమేష్,గ్రామ సర్పంచి తోట మాధురి రాజారెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమైన పాదాలే జీవితానికి బలమైన పునాది




ప్రజాపక్షం/జగిత్యాల ః ఆరోగ్యమైన పాదాలే మనిషి చరకైన జీవితానికి బలమైన పునాది అని హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రి వైద్యుడు ఆదిత్య సోమయాజి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో రోగులకు పాదం,మడమ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ పాదం,మడమ శస్త్ర చికిత్స నిర్వహించే వైద్యుడు ఆదిత్య సోమయాజి హాజరై పాదం,మడమ సమస్యలు,చికిత్సలో ఆధునిక పురోగతులు తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు.అనంతరం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాదం, మడమ సమస్యలు చాలా సాధారణమైనవే అయినప్పటికీ నిర్లక్ష్యం చేయడంతో నొప్పి ఎక్కువగా అయ్యే అవకాశాలు ఉంటాయన్నారు.ఇలాంటి సమస్యలు తరుచుగా కాలు బెనకడం, క్రీడల వచ్చే గాయాలు, మధుమేహంతో సమస్యలు ఎక్కువగా వస్తాయన్నారు.వీటిని ఆరంభ దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదించాలన్నారు.ఇలాంటి సమస్యలకు ఆధునిక స్కానింగ్ పద్దతులతో ఖచ్చితంగా సమస్యను గుర్తించి యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో చికిత్సలు అందిస్తున్నామన్నారు.చికిత్సలు హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో విజయవంతం గా పూర్తి చేయడంతో ఎంతో మంది ఆధునిక పిజియాతెరపి, పునరావాస చికిత్సల తో రోగులు త్వరగా తమ రోజువారీ పనులు, ఉద్యోగం,క్రీడలకు తిరిగి వెల్లుతున్నారన్నారు. ఆరోగ్య వంతమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ పాదం, మడమ నొప్పిని నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్లు ధనుంజయ, పాలకుర్తి నవీన్ కుమార్,తదితరులు ఉన్నారు.

## మండల కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడిగా రాయమల్లు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన అధ్యక్షుడిగా మండలంలోని బొంకూర్ గ్రామానికి చెందిన ఓరగంటి రాయమల్లు (జాను) నియమితులయ్యారు.తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మానకొండూర్ శాసనసభ్యులు అండ్ టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డా కవ్వంపల్లి సత్యనారాయణ, డీసీసీ జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఓరగంటి రాజమల్లు (జాను)ను నియమిస్తూ జగిత్యాల జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ దుమాల రాజ్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన మండల ఎస్సీ సెల్ చైర్మన్ ఓరగంటి రాయమల్లు (జాను) మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ ఎమ్మెల్యే డా కవ్వంపల్లి సత్యనారాయణ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.తన నియామకానికి కృషిచేసిన మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు రాపల్లి గంగన్న కు ధన్యవాదాలు తెలిపారు.తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మండలంలో పార్టీ బలోపేతానికి , ఎస్సీల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయ న పేర్కొన్నారు. రాయమల్లు నియామకం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాపల్లి గంగన్న ,జిల్లా కార్యదర్శి చిర్ర దిలీప్ ,సర్పంచ్ లు ఆకుల సుమన్ గౌడ్,ములకల శిరీష శ్రీనివాస్,స్వామి,స్రవంతి గంగారం తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### జడ్జి వై. జానకి



**ప్రజాపక్షం/ధర్మపురి :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ధర్మపురి కోర్టు న్యాయమూర్తి వై. జానకి అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని,ప్రజలు ప్లాస్టిక్ కవర్లు ,ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.ప్లాస్టిక్ నివారణ ఉద్యమ నేత,సీనియర్ న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి వై.జానకి మాట్లాడుతూ శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి, వాటికి ప్రత్యామ్నాయంగా స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, జ్యూట్ బ్యాగులను వినియోగించాలని సూచించారు.ప్రజల్లో ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం జడ్జి వై.జానకి చేతుల మీదుగా జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందేల రమేష్,ఉపాధ్యక్షుడు మామిడాల శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శి రామడుగు రాజేష్,అసిస్టెంట్ ప్లీడర్ ఇమ్మడి శ్రీనివాస్,లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్, కీర్తి,కస్తూరి శరత్,కోర్టు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా పాస్ బుక్‌లు పొందిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** గొల్లపల్లి మండలంలో కొత్తగా పట్టాదార్ పాస్ బుక్ లు పొందిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కరుణ ఒక ప్రకటనలో తెలిపారు .గొల్లపల్లి మండల పరిధిలోని గ్రామాల వ్యాప్తంగా కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ 01/01/2026 నుండి 13/08/2026 వరకు పొంధిన రైతులందరూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అగ్రి స్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ లో తమ వివరాలను వెంటనే నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు ఒక ప్రకటనలో కోరారు. గొల్లపెల్లి మండలం: గొల్లపెల్లి మండలంలో కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ (Farmer Registry) చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక నమోదు కార్యక్రమాల్లో భాగంగా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు . రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ ,ఆధార్ కార్డు లింక్ ఉన్న మొబైల్ ఫోన్ తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏ ఈ ఓ )ను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. ప్రభుత్వం అందించే వివిధ రైతు సంక్షేమ పథకాలు ,పీఎం కిసాన్ ,ఉచిత ఎరువులు ,విత్తనాల సబ్సిడీ సులభంగా పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం ముఖ్యమైనది.ఇతర రభుత్వ ప్రయోజనాలు పొందడానికి ఈ 11 అంకెల విశిష్ట గుర్తిం పు సంఖ్య (ఫార్మర్ ఐడి )అత్యంత ప్రమాణికం .కావున గొల్లపెల్లి మండలంలోని కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

## జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



**ప్రజాపక్షం /రాయికల్ :** రాయికల్ మండల కేంద్రంలో ని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు మండల స్థాయి ఎస్ జి ఎఫ్ పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పారిపెల్లి గంగాధర్ తెలిపారు. 14 ఇయర్స్ విభాగంలో జి మానస,అయాన్,ధనిష్,మణికంఠ నిశాంత్,హర్షవర్ధన్, సారిక, శ్రీరామ్,రమేష్, ప్రణతి,17 ఇయర్స్ విభాగంలో ఎం అవంతిక,అమూల్య,అర్చన,రిషికేష్,రేయాన్,రాము, జస్వంత్, హర్షవర్ధన్,రోహిత్,ప్రేమ్ కుమార్,హర్షవర్ధన్ ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం,గంగ జమున,సత్యనారాయణ,తిరుమల,వనిత, పద్మజ, గంగాధర్, శ్రీకాంత్,యాస్మిన్ ఫాతిమా,తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో మునిగి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ధర్మపురి :** గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన ధర్మపురి గోదావరి నదిలో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీసగోని లచ్చయ్య (51) గోదావరి నదిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు.లచ్చయ్య నదీ తీరంలో కొబ్బరికాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య పద్మతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భక్తిశ్రద్ధలతో వినాయకుడికి కుంకుమార్చన



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నంః** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని గౌణేకాపు సంఘ భవనంలో కంతివాడకట్టులోని ఫ్రీడమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళ వారం మహిళలు కుంకుమార్చన పూజ ను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పురోహితులు రాజేందర్ శర్మ, సంతోష్ చార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## లలిత కళా సమితి స్థలాన్ని కాపాడాలి

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి కీర్తి ప్రతిష్ఠలకు ప్రతీకగా నిలిచిన లలిత కళా సమితి స్థలం ఆక్రమణకు గురవుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తమైంది.స్థలాన్ని పరిరక్షించి,ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా అధికారులకు సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ లలిత కళా సమితి, తెలంగాణ సాధన సమితి, డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వినతి పత్రాలు సమర్పించారు. అధికారులు సత్వరమే స్పందించి సంస్థకు,కళాకారులకు న్యాయం చేయాలని వారు కోరారు.సంస్థ స్థల పరిరక్షణకు చేపట్టే పోరాటానికి అండగా ఉంటామని శాస్త్రి యువజన సంఘం,వైఎస్‌ఏ, ఇంద్రసేన,హిందూసేన పాతబస్తీ ప్రతినిధులు తెలిపారు.కార్యక్రమంలో నాంపల్లి గట్టయ్య,గుంటుక గంగాధర్,తొగిటి అంజయ్య,మట్టెల గంగాధర్,కోటగిరి చైతన్య,డీఎల్‌ఎన్ వర్మ,తదితరులు పాల్గొన్నారు.

## అలనాటి స్నేహితులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ఆర్ఆర్ గ్రాండ్ హోటల్ అధినేత కల్వకుంట్ల రామారావు, రేగుంట మాజీ సర్పంచ్ బైరనేని విద్యాసాగర్ రావు లతో 40 సంవత్సరాల స్నేహబంధం మరువలేదని రేగుంట మాజీ సర్పంచ్ రంగురామా గౌడ్ అన్నారు మంగళవారం మర్యాద పూర్వక కలయికలో భాగంగా 40 సంవత్సరాల స్నేహబంధం లో అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ స్వీట్లను తినిపించి శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ఫజల్‌కు సన్మానం



**ప్రజాపక్షం/జైనూర్ :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, పాత్రికేయుల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని వక్తలు ఆకాంక్షించారు. తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టిజెఎ) కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ ఫజల్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. జైనూర్ మండల కేంద్రంలోని ఉస్మాన్ కేరళ గ్రామర్ పాఠశాలలో సీనియర్ పాత్రికేయుడు షేక్ జమీల్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ సజ్జద్, ఏఈఓ ఖాలిల్, పాత్రికేయుడు సయ్యద్ సబీర్ తదితరులు ఫజల్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ పాత్రికేయ రంగానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రమాదకర గుంత పూడ్చివేత



**ప్రజాపక్షం/జన్నారం :** ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకర గుంతను మంగళవారం మొరం పోసి పూడ్చివేశారు. సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టారు. రోడ్డు పక్కన ప్రమాదకరంగా మారిన గుంతను గుర్తించిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంద రాజేష్ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె వెంటనే స్పందించారు. నిమజ్జన కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే సంబంధిత సిబ్బందితో గుంతను పూడ్చివేయించారు. ప్రజల భద్రతకే తమ మొదటి ప్రాధాన్యమని, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ పనులు చేపట్టినట్లు గ్రామపంచాయతీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈఓ రాహుల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంద రాజేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 24న మండల సమావేశం

**ప్రజాపక్షం/కౌటాల :** కౌటాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 24న ఉదయం 11 గంటలకు మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ కోట ప్రసాద్ తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జల సంరక్షణ, విబి గ్రామ్ జి పథకం, పారిశుధ్య నిర్వహణ, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరుల పెంపు తదితర అంశాలను ప్రధానంగా సమీక్షించనున్నారు. గ్రామాల్లో వీధి కుక్కలు, కోతుల బెడద నియంత్రణతో పాటు వీధి దీపాల నిర్వహణపై చర్చించనున్నారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

# కాగజ్‌నగర్ ఠాణాలో డిఐజి తనిఖీ



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కాళేశ్వరం జోన్ డిఐజి అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులను ఆదేశించారు. కాగజ్ నగర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, కేసుల పురోగతి, సిసి కెమెరాలు, రిసెప్షన్ విభాగాలను పరిశీలించి సిబ్బంది హాజరు, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సత్వర న్యాయం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం కాగజ్ నగర్ పట్టణంలోని గణపతి నిమజ్జన ప్రదేశాన్ని జిల్లా ఎస్‌పి నితికా పంత్‌తో కలిసి డిఐజి పరిశీలించారు. నిమజ్జన రూట్ మ్యాపులు, పాయింట్లు, విగ్రహాల తరలింపు వివరాలను ఆరా తీశారు. బారికేడింగ్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, క్రేన్లు, బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించి పలు సూచనలు చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డిఎస్‌పి వాహిదుద్దీన్, సిఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శాస్త్రీయ పద్ధతులతోనే అధిక దిగుబడులు

### వ్యవసాయ అధికారి దిలీప్ కుమార్



**ప్రజాపక్షం / రెబ్బన :** అపరాలు, నూనెగింజల సాగులో రైతులు శాస్త్రీయ, ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి దిలీప్ కుమార్ తెలిపారు. అపరాలు, నూనెగింజల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఆత్మ (ఎటిఎంఎ) ఆధ్వర్యంలో మంగళవారం రెబ్బనలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సరైన సమయంలో విత్తుకోవడం వంటి అంశాలపై వివరించారు. నేల స్వభావం, భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వేసుకోవాలని సూచించారు. నీటి వృథా అరికట్టి అవసరమైన మేరకే తడులు ఇవ్వాలని, కలుపు మొక్కలను ప్రారంభ దశలోనే నివారించాలని పేర్కొన్నారు. చీడపీడలను సకాలంలో గుర్తించి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, సమగ్ర పోషక యాజమాన్యంతో పంట ఎదుగుదల, దిగుబడి బాగుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మ అధికారి సంజీవ్, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మించాలని విద్యార్థుల ఆందోళన



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** గుంతలమయంగా మారిన రోడ్డును వెంటనే బాగుచేయాలని డిమాండ్ చేస్తూ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలో మంగళవారం లోడ్‌పల్లి, కొండపల్లి గ్రామాల విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. బెజ్జూర్ నుంచి పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రోడ్డు అధ్వానంగా మారడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పెంచికల్‌పేట్‌బెజ్జూర్ రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ఆటోలు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వాపోయారు. వర్షాలకు గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి వెంటనే పూర్తిస్థాయి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అనిల్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

# ఉత్సాహంగా 'నియర్ బై ఏరియా' క్రీడా పోటీలు



**ప్రజాపక్షం/మందమర్రి :** క్రీడాకారులు పూర్తి క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఎఫ్/ఎ (ఎజిఎం) ఆర్‌విఎస్‌ఆర్‌కె. ప్రసాద్, ఏఐటియుసి మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్ సూచించారు. మందమర్రి సింగరేణి ఏరియాలోని స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణలోని యోగా హాల్‌లో మంగళవారం 'నియర్ బై ఏరియా' క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను వారు లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ ప్రతిభ చూపి ఎంపికైన విజేతలు రామగుండం రీజియన్‌లో జరిగే సంస్థ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించి, బెల్లంపల్లి రీజియన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. త్వరలో ఉద్యోగ విరమణ పొందనున్న ములకలపల్లి వెంకటేశ్వర్లు, సిహెచ్. అశోక్‌లను అధికారులు, యూనియన్ నాయకులు, క్రీడాకారులు ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూపిఎస్/జిఎ గౌరవ కార్యదర్శి కార్తీక్, జిఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు సివి. రమణ, క్రీడల సమన్వయకర్త శివ, జనరల్ కెప్టెన్ సాక శీను, క్రీడల పర్యవేక్షకుడు సిహెచ్. అశోక్, కెప్టెన్లు ములకలపల్లి వెంకటేశ్వర్లు, పెద్దపల్లి బానయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

**ప్రజాపక్షం/బెల్లంపల్లి టౌన్ :** గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా బెల్లంపల్లి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్, రాజేశ్వరి సహకారంతో గర్భిణులు, బాలింతలు, డయాలసిస్ రోగులకు భోజనం పంపిణీ చేశారు. మానవ సేవే మాధవ సేవగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యురాలు జేరిపోతుల చంద్రకళ, పోతురాజుల తిరుపతి, ఉప్పుట్ల శంకర్, దాడి సురేష్, మాడావి సోమేష్, ఉప్పులేటి శశికుమార్ పాల్గొన్నారు.

## నేడు కలప డిపోలో బహిరంగ వేలం

### ఎఫ్‌డిఓ రామ్మోహన్



**ప్రజాపక్షం/జన్నారం :** మండల కేంద్రంలోని ప్రభుత్వ కలప డిపోలో బుధవారం కలప లాట్ల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 182 లాట్లలోని 45.449 ఘనపు మీటర్ల కలపను వేలంలో విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులు, ఫర్నిచర్ తయారీ, కలప ఆధారిత పరిశ్రమల అవసరాల నిమిత్తం నాణ్యమైన కలపను కొనుగోలు చేయదలచిన వ్యాపారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నిమజ్జనంలో డిజెలకు అనుమతి లేదు

### సిఐ రమేష్

**ప్రజాపక్షం / జైనూర్ :** గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఊరేగింపుల్లో డిజెలకు ఎలాంటి అనుమతి లేదని జైనూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్‌పి నితికా పంత్ ఆదేశాలు, ఆసిఫాబాద్ డిఎస్‌పి సూచనల మేరకు మంగళవారం జైనూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొంటూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జనం ర్యాలీతో పాటు నిమజ్జన ప్రాంతం వద్ద విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందికి ఉత్సవ కమిటీలు, భక్తులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైనూర్ ఎస్‌ఐ రవికుమార్, సిర్పూర్ యు ఎస్‌ఐ కొమురయ్య, లింగాపూర్ ఎస్‌ఐ సురేష్, ఆర్‌ఎస్‌ఐ మోహన్, ఎఆర్‌ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలకు తాండవ కృష్ణ ఎంపిక



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** క్రీడల్లో రాణించడానికి నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ అన్నారు. రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు తాండవ కృష్ణను మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆటల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన అలవడుతాయన్నారు. భవిష్యత్తులో కృష్ణ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి అధికార ప్రతినిధి దేవసాని ఆనంద్, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలీసుల ఫ్లాగ్ మార్చ్

### సిఐ సంతోష్ కుమార్



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతా భావం కల్పించేందుకు సిర్పూర్ టి పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ కవాతు పట్టణంలోని పలు వీధుల గుండా గోవింద్‌పూర్ కాలనీ వరకు కొనసాగింది. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ అన్ని ముందస్తు ఏర్పాట్లు చేస్తోందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలకు భద్రతపై పూర్తి భరోసా కల్పిస్తూ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌటాల సిఐ బి. సంతోష్ కుమార్, సిర్పూర్ టి ఎస్‌ఐ డి. సాగర్, కౌటాల ఎస్‌ఐ సతీష్, చింతలమానేపల్లి ఎస్‌ఐ కమలాకర్, బెజ్జూర్ ఎస్‌ఐ విజయ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దిలావర్‌పూర్‌లో స్వచ్ఛతా హి సేవా–2026 కార్యక్రమం

## పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ




**ప్రజాపక్షం/దిలావర్‌పూర్** : 'స్వచ్ఛతలో భాగస్వామ్యం – స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్' అనే మహోన్నత నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛతా హి సేవా–2026' కార్యక్రమంలో భాగంగా దిలావర్‌పూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ విశేష కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు.ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా పర్యావరణానికి ఎంతో శ్రేయస్కరమైన మట్టి గణపతి విగ్రహాన్ని అత్యంత శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. అనంతరం నిమజ్జనం చేసిన ఆ మట్టిని వృథా చేయకుండా, వినూత్న రీతిలో అదే మట్టిని వినియోగిస్తూ అక్కడే అధికారులతో కలసి మొక్కలు నాటి పర్యావరణ స్ఫూర్తిని చాటారు.ఈ సందర్భంగా డిఆర్‌డిఒ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీలో ఉపయోగించే హానికర రసాయనాల వల్ల మన నీటి వనరులు తీవ్రంగా కలుషితమై పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రతి ఒక్కరూ పిఒపి విగ్రహాలను పూర్తిగా వీడి, బాధ్యతగల పౌరులుగా పర్యావరణహితమైన మట్టి గణపతులను మాత్రమే ఉపయోగించి మన ప్రకృతిని, నీటి వనరులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్క రోజుతో ముగిసిపోయేది కాదని, అది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని కోరారు.దీనికితోడు గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతను పెంపొందించేందుకు పంచాయతీరాజ్, సెర్ప్ యంత్రాంగాలు ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ప్రతీ పంచాయతీలో చెత్త సేకరణ సమర్థవంతంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.అనంతరం స్వచ్ఛత,పర్యావరణ పరిరక్షణకు సంబంధించి కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది. అధికారులతో ఆమె ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయించారు.మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అక్షర అనిల్. ఎంపీడీవో అరుణ రాణి, ఎంపిఒ గోవర్ధన్, ఎపిఒలు దివ్యారెడ్డి, బోస్, టెక్నికల్ అసిస్టెంట్లు, సీసీలు, విబి–జి రాంజీ సిబ్బంది, సెర్ప్ అధికారులు, పంచాయతీరాజ్. ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతల పూజలు

**ప్రజాపక్షం/లోకేశ్వరం** : అబ్దుల్లాపూర్ గ్రామంలో మోక్ష గణపతి కర్ర వినాయకుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, బిఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు, లోలం శ్యాంసుందర్, ఆయన వెంట మండల కన్వీనర్ కరిపే శ్యాంసుందర్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ చిన్నారావు, మాజీ వైస్ ఎంపిపి సాయన్న, మాజీ సర్పంచ్ దిగంబర్,బిఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, నాయకులు సంజీవ్, సందీప్, ప్రవీణ్ , తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**ప్రజాపక్షం /పెంబి** : మండలం ఇటిక్యాల తండాకు చెందిన బాణావత్ ప్రమీలకు మంజూరైన రూ.19 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుడిసె రమేష్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు సత్యనారాయణస్వామి, స్వప్నిల్‌రెడ్డి, భూమేష్, తోకల మహేందర్, గోధురి భూమేష్, ఇస్మాయిల్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి స్వాగతం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్** : ఆదిలాబాద్ లో పర్యటించి, స్వల్ప విరామం కొరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ,వైద్యారోగ్య శాఖ కార్యదర్శి డా.క్రిస్టియానా జె. చోంగ్తూ లకు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు.అనంతరం కలెక్టర్ ఛాంబర్ లో అధికారులతో మంత్రి సమావేశమయ్యి, వివిధ అంశాలపై చర్చించారు. మంత్రికి స్వాగతం పలికినవారిలో డిఆర్‌ఓ రాథోడ్ రమేష్,డిఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, వైద్యారోగ్య శాఖ అధికారులు, ఇతర అధికారులు ఉన్నారు.

## చెరకు పంటపై రైతులకు మార్గదర్శక కార్యక్రమం



**ప్రజాపక్షం/తానూర్** : రైతు సమృద్ధి గ్రామ ప్రగతి లక్ష్యంగా తానూర్ మండల కేంద్రంలో జాదవ్ శివాజీ రావ్ పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం చెరకు పంటపై రైతులకు అవగాహన మార్గదర్శక కార్యక్రమం ఏర్పాటు చేశారు.రైతులు ఆధునిక పద్ధతుల్లో చెరకు సాగు చేసి అధిక దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శివాజీ పటేల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో చేరకు పంట వ్యవసాయ మార్గదర్శకుడు మారుతి రావ్ పటేల్ కావాలే గురూజీ, రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా చెరకు పంట సరైన నాటే పద్ధతి,ఆధునిక సాంకేతికత,అధిక దిగుబడినిచ్చే వంగడాలు,నీరు మరియు ఎరువుల యాజమాన్యం, చీడపీడల నియంత్రణ వంటి అంశాలపై వివరంగా తెలియజేశారు.ఈ సందర్భంగా రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం, డ్రిప్ ఇరిగేషన్ వల్ల కలిగే లాభాలను నిపుణులు వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాయకులను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోశెట్టి,సర్పంచ్లు మాధవ్ రావ్,రవీందర్,మాజీ సర్పంచ్ రాములు,జాదవ్ గోవింద్ పటేల్, బండారే సోంనాథ్, భద్రే సాయినాథ్,రమేష్ పటేల్, తానాజీ పాటిల్,డి రమేష్, అల్తాఫ్, చుట్టుపక్కల గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు సిర్గాపూర్‌లో ఆయుర్వేద హోమియోపతి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/దిలావర్ పూర్** :11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సిర్గాపూర్‌లో ఉచిత వృద్ధాప్య ఆరోగ్య శిబిరం బుధవారం రోజున నిర్వహించడం జరుగుతుందని,ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్ గ్రామంలో వృద్ధాప్య ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా ఆయుష్ శాఖ తెలిపింది.వృద్ధులతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి,వైద్యులచే అవసరమైన ఆరోగ్య సలహాలు మరియు వైద్య సూచనలు అందించనున్నారు.అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు ఆయుర్వేద మరియు హోమియోపతి మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ముఖ్యంగా వృద్ధులు తమ ఆరోగ్య సమస్యలను వైద్యులకు తెలియజేసి తగిన వైద్య సలహాలు పొందాలని అధికారులు సూచించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కల్పించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశ్యమని డా. ఏ.నారాయణ రావుజిల్లా ఇన్‌చార్జ్ఆయుష్ శాఖ,నిర్మల్ జిల్లా ఒక ప్రకటనలో తెలిపారు.

## గణేష్ నిమజ్జోత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి



**ప్రజాపక్షం/భైంసా** : భైంసా పట్టణంలో గణనాథుని నిమజ్జనోత్సవాల సందడి నెలకొంది.ఎటు చూసినా వినాయక మండపాలు, భక్తుల సందడి కనిపిస్తోంది. "గణపతి బప్పా మోరియా.. బై బై గణేశా" అంటూ భక్తులు,యువత నామ స్మరణతో వీధులు మార్మోగుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు వినాయక మండపాల్లో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు అందుకున్న గణనాథులు నిమజ్జనోత్సవానికి తరలుతున్నారు.ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ నిమజ్జనోత్సవాల్లో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నిమజ్జన కార్యక్రమంలో పాల్గొంటున్న భక్తులు,కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.గణేష్ నిమజ్జనోత్సవాలను శాంతియుత వాతావరణంలో,ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని ఆయన కోరారు.గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## విద్యుత్ పొదుపుతోనే ఆర్థిక మదుపు: ఎస్ఇఎ రమేష్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్** : విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం వల్ల విద్యుత్ బిల్లులు తగ్గడంతో పాటు కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని నిర్మల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎ. రమేష్ తెలిపారు. ఒక కుటుంబం రోజుకు 2 యూనిట్లు ఆదా చేస్తే, సంవత్సరానికి 730 యూనిట్లు పొదుపు చేయవచ్చన్నారు.అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయడం, గీజర్లు, ఇస్త్రీ పెట్టెల వాడకం తగ్గించడం ద్వారా విద్యుత్ భారాన్ని తగ్గించవచ్చని సూచించారు.విద్యుత్ పొదుపును అలవాటుగా మార్చుకోవాలని ఆయన కోరారు. డిఇ (టెక్నికల్) ఒ.వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు.

## నూతన రేషన్ కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/లోకేశ్వరం** : లోకేశ్వరం మండలం లోని రాజర గ్రామలలో అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ ఫలాలు చేరువ చేసేలా మంగళవారం నూతన రేషన్ కార్డుల పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ శ్యామల మరియు అధికారులు గ్రామస్తుల సమక్షంలో లబ్ధిదారులకు స్వయంగా కొత్త కార్డులను అందజేసి అభినందించారు. అనంతరం సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా అందడంలో రేషన్ కార్డులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. నూతన కార్డుల ద్వారా ఇకపై సకాలంలో నిత్యావసర సరుకులు అందుతాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొమ్మన సురేష్, పంచాయతీ అనిత, జిపిఒ శ్రీధర్, రేషన్ డీలర్ నర్సారెడ్డి, విడిసి చైర్మన్ ముత్తా గౌడ్, సాయి ప్రసాద్, చిన్నయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ దినోత్సవ వేడుక




**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్** : ఖానాపూర్ మండలం మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో , నృత్యాలతో అలరించి చిత్రలేఖనం,హిందీ ప్రసంగం,సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో మస్కాపూర్ సర్పంచ్ దొనికెని లక్ష్మి మాట్లాడుతూ దేశ సమగ్రతకు, విభిన్న సంస్కృతుల అనుసంధానానికి జాతీయ భాషగా హిందీ ఎంతో దోహదపడుతుందని, జాతీయ సమైక్యతను కాపాడటానికి హిందీ భాష ఒక మార్గమని పేర్కొన్నారు. విద్యార్థులు మాతృభాషతో పాటు జాతీయ భాష అయిన హిందీపై పట్టు సాధించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇలాంటి వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దొనికేని వెంకటేష్, నాయకులు దయానంద్, హిందీ ఉపాధ్యాయులు గడప దీప్తి, జాగ్దండ్ లక్ష్మణ్ రావు, ఉపాధ్యాయులు శంకర్, శేఖర్, అంజయ్య, ఇమ్రాన్, శోభారాణి, కిషన్ ప్రసాద్, చందన, షఫీ, ఫరాజ్, విజయ్, రవి, వినోద్రాజ్ ,ధర్మయ్యా,స్వప్న,గంగాధర్, రమేష్,ఝాన్సీ, సృజన,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ సామాజిక తనిఖీ

**ప్రజాపక్షం /పెంబి** :పెంబి గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి 5వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు,కూలీల హాజరు,మస్టర్ రోల్స్, చెల్లింపులు,పనుల రికార్డులు తదితర అంశాలను సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది.గ్రామస్థుల నుంచి కూడా సంబంధిత పనులు,కూలీలకు అందిన వేతనాలు తదితర అంశాలపై వివరాలు సేకరించారు.సామాజిక తనిఖీ ద్వారా ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత,జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు గ్రామస్థులకు పథకం అమలుపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేపల్లి సత్యనారాయణ స్వామి, ఉప సర్పంచ్ గోధూరి రజిత భూమేష్, వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## శోభయాత్రలో ఎమ్మెల్యే స్టెప్పులు



**ప్రజాపక్షం/భైంసా** : భైంసా పట్టణంలో గణనాథుని నిమజ్జన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గణనాథుల శోభాయాత్రకు మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్, మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి, కౌన్సిలర్ లు గణనాథులకు పూజలు నిర్వహించి, స్వాగతం పలికారు.ఈ సందర్భంగా డిజె పాటలకు ఎమ్మెల్యే పటేల్, చైర్మన్ కౌన్సిలర్లు స్టెప్పులు వేయడంతో శోభయాత్రలో ఉత్సాహం నెలకొంది.

# ధాన్యం కమీషన్‌లో అవకతవకలు లేవు

## ఎడపల్లి చైర్మన్ పోల మల్కారెడ్డి




**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రగతి పథంలో పయనిస్తుంటే, ఓర్వలేక కొందరు కావాలని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇటువంటి అసత్య ప్రచారాలను రైతులు, ప్రజలు నమ్మవద్దని సింగిల్ విండో చైర్మన్ పోల మల్కారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఎడపల్లి సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సొసైటీలో జరిగిన రూ. 30లక్షల నిధుల దుర్వినియోగంపై రికవరి ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని, ఇప్పటికే సెల్స్‌మెన్ల నుంచి రూ. పది లక్షల రికవరీ చేశామని ఆయన వెల్లడించారు. మిగతా నిధులు మరో వారం రోజుల్లో సొసైటీ ఖాతాలో జమ కానున్నాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు కమీషన్ డబ్బుల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని, గత పది ఏళ్లుగా కమీషన్ నిధులను నిబంధనల ప్రకారమే సొసైటీ ఖర్చులు, నిర్వహణకు ఉపయోగిస్తున్నామని, మిగిలిన డబ్బులు డిపాజిట్ల రూపంలో ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం సొసైటీ రూ. రెండు కోట్ల లాభాన్ని ఆర్జించి జిల్లాలోనే రెండవ స్థానంలో నిలిచిందని మల్కారెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోలు క మీషన్ నిధుల విషయంలో ఎలాంటి అవినీతి జరగలేదని, తప్పుడు ఆరోపణలకు భయపడేది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి రాజారాం, కార్యవర్గ సభ్యులు, రైతు నాయకుడు కామప్ప పాల్గొన్నారు.

# రిమ్స్ ప్రమాదంపై విచారణ జరిపించాలి

**ప్రజాపక్షం/మావల:** ఆదిలాబాద్ రిమ్స్ ఎస్ఎన్‌సియు వార్డు అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని మాదిగ జెఎసి జిల్లా అధ్యక్షుడు మాల్యాల మనోజ్ ముఖ్యమంత్రిని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన పసికందుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ఫైర్, ఎలక్ట్రికల్ ఆడిట్ నిర్వహించి భద్రతను మెరుగుపరచాలన్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**ప్రజాపక్షం/మావల:** మావల మండల పరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ మిల్కాతో కలిసి ఎఎంసి చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమావేశాలకు అధికారులే స్వయంగా హాజరుకావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ముత్యంరావు, సర్పంచులు చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, దినేష్ పాల్గొన్నారు.

# రిమ్స్ ఆసుపత్రి సందర్శన

**ప్రజాపక్షం/మావల:** రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్‌సీయూ వార్డు అగ్ని ప్రమాద స్థలాన్ని ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఘటనపై రిమ్స్ డైరెక్టర్‌ను వివరణ కోరిన ఆయన, చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్యుడి గైర్హాజరుపై ఆరోపణలు

**ప్రజాపక్షం/కౌటాల :** కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి)లో డాక్టర్ సకాలంలో అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్యూటీ సమయంలో వైద్యుడు ప్రైవేట్ ఆసుపత్రిలో ఉంటున్నట్లు సమాచారం ఉందని వారు పేర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వ దవాఖానాకు చికిత్స నిమిత్తం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని, ప్రజలకు నిరంతరం మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# భక్తులకు అన్నప్రసాదం

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని కుమ్మరివాడలో ఏర్పాటు చేసిన యువ గణేష్ మంటపం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ అనిల్ కుమార్ భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ కుమార్‌తో పాటు పశువైద్యాధికారి రాకేష్‌ను గణేష్ మండలి సభ్యులు శాలువాలతో సత్కరించారు. మంటపం వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండలి సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# గణపతి నిమజ్జనానికి రెండు బాక్సులకే అనుమతి

## ఎసిపి వెంకటేశ్వర్ రెడ్డి




**ప్రజాపక్షం/ఆర్మూర్:** గణపతి నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఆర్మూర్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సారంగి శాంతి కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రూరల్ సర్పంచ్‌లతో కలిసి డిజేలకు అనుమతి ఇవ్వాలని ఎసిపి, సిఐను కోరగా వారు డీజేలకు అనుమతి ఇవ్వడానికి నిరాకరించారు. నిమజ్జన కార్యక్రమంలో రెండు బాక్సులకు మాత్రమే అనుమతి ఇస్తామని అధికారులు స్పష్టం చేశారు. నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసుల సూచనలు, నిబంధనలను యువత ప్రతి ఒక్కరూ పాటించాలని, శృతి మించకుండా ఉండాలని ఎసిపి వెంకటేశ్వర్‌రెడ్డి, నిర్వాహకులకు సూచించారు. ఎసిపి ని కలిసిన వారిలో పిప్రి సర్పంచ్ కిరణ్ గోవింద్ పేట్ సర్పంచ్ అప్పల గణేష్ రాంపూర్ సర్పంచ్ రాజేందర్ పల్లె సర్పంచ్ సంజీవ్ పార్డేమ్ పతేపూర్ సర్పంచ్ నాగరాజు, కోమన్‌పల్లి సర్పంచ్ ప్రవీణ్ గౌడ్, సుబ్రియల్ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ స్థల పరిశీలన



**ప్రజాపక్షం/ఆర్మూర్:** పట్టణ అభివృద్ధిలో భాగంగా నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మంగళవారం ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ యార్డును ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా మున్సిపల్ కమీషనర్ ఎఎంసి చైర్మన్ సాయిబాబా గౌడ్, కార్యదర్శి జి.పరమేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో 11ఎకరాల ఏడు గుంటలు అందుబాటులో ఉన్న స్థలాన్ని పరిశీలించి, మూడు ఎకరాలలో నూతన మున్సిపల్ కార్యాలయ భవనాల నిర్మాణానికి అనుకూలత, అవసరమైన సౌకర్యాలు, ప్రజలకు అందుబాటులో ఉండే విధానం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. నూతన మున్సిపల్ కార్యాలయం పోలీస్ రెవెన్యూ మూడు శాఖలకు సంబంధించిన నిర్మాణాలు పూర్తైతే ప్రజలకు పాలన పరంగా మెరుగైన సేవలు అందించడంతో పాటు పట్టణ పరిపాలన మరింత సులభతరం అవుతుందని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలిపారు. స్థల పరిశీలనలో తహసీల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ అధికారులు, మార్కెట్ యార్డు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# టూరిజం క్లబ్ పోటీల్లో గుండంపల్లి విద్యార్థికి ద్వితీయ బహుమతి




**ప్రజాపక్షం /దిలావర్ పూర్ :** ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27 ను పురస్కరించుకొని యువ టూరిజం క్లబ్ కాంపిటీషన్స్ లో భాగంగా మంగళవారం రోజున జిల్లా స్థాయి పోటీలను జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలోగుండంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని మనోజ్ఞ డ్రాయింగ్ కాంపిటీషన్‌లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది.మొదట పాఠశాల స్థాయిలో మొదటి స్థానం లోనూ, మండల స్థాయిలో మొదటి స్థానంలోనూ, మంగళవారం నిర్వహించిన పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిలారి మధుసూదన్, ఉపాధ్యాయులు,గ్రామస్తులు విద్యార్థినిని అభినందించారు. విద్యార్థినికి చక్కని మెళకువలు నేర్పి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడానికి కారణమైన ఆర్ట్ టీచర్ సాయినాథ్ ను కూడా అభినందించారు.

# గణపతి సన్నిధిలో ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/మందమర్రి :** గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. మందమర్రి పట్టణంలోని శ్రీ హరిహర దేవస్థానం అయ్యప్ప ఆలయంలో ఉత్సవాల ముగింపు వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా చేపట్టారు. ఆలయ అర్చకులు రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో గణపతి స్వామికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన, గణపతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించగా ఓదెలు దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రారంభం నుంచి అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వారు అందిస్తున్న సహకారాన్ని కొనియాడుతూ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సుమారు 500 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నారుల ప్రాణాలు ప్రభుత్వ హత్యలే

**ప్రజాపక్షం/నేరడిగొండ:** రిమ్స్ అగ్ని ప్రమాదంలో చిన్నారులు మృతి చెందడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని, ఇవి ప్రభుత్వ హత్యలేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి బాధితులను పరామర్శించిన ఆయన, బాధిత కుటుంబాలకు రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల సంపూర్ణ వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# నాణేల అలంకరణలో లక్ష్మీ గణపతి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** వినాయక చవితి ఉత్సవాల వేళ మండల వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ విరాజిల్లుతోంది. పండగ సందర్భంగా ఊరూరా విభిన్న రూపాల్లో ఉన్న గణనాథుల విగ్రహాలతో పాటు, రకరకాల ఆకృతుల్లో రూపొందించిన మండపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కొందరు పూలు, పండ్లు, కూరగాయలతో మండపాలను అలంకరిస్తుండగా, ఎడపల్లి మండల కేంద్రంలో మాత్రం శ్రీ వీరభద్ర వినాయక మండలి నిర్వాహకులు స్వామి వారికి వినూత్నంగా కరెన్సీ అలంకరణ చేశారు. శ్రీ వీరభద్ర వినాయక మండలి ఆధ్వర్యంలో స్వామి వారిని కరెన్సీ నోట్లు, నాణేలతో ఎంతో కన్నుల పండువగా ముస్తాబు చేశారు.స్వామి వారితో పాటు మండపాన్ని మొత్తం రూ. 70వేల విలువైన కొత్త కరెన్సీ నోట్లు, నాణేలతో రకరకాల ఆకృతుల్లో అందంగా అలంకరించారు. దీంతో ఈ గణనాథుడిని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

# ఘనంగా వినాయక నిమజ్జన శోభయాత్రలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం గణనాథుని నిమజ్జన శోభయాత్ర శోభాయమానంగా కొనసాగింది. నిమజ్జనం సందర్భంగా రథాలను పూలమాలలతో, లైట్లతో ఆకర్షణీయంగా అలంకరించారు. గ్రామాలలోని వీధులగుండా తిరుగుతూ నిమజ్జన శోభాయాత్ర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేరకు జానకంపేట్, ఏఆర్‌పి క్యాంప్, పోచారం, దుబ్బాతాండా, ఎడపల్లి నయాబాది, జంలం, బ్రాహ్మణపల్లి, అంబం, ధర్మారం, వడ్డేపల్లి తదితర గ్రామాలలో వినాయక నిమజ్జన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు భారీగా అన్నదానాలు, లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ముత్యాల రమ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రారంభమైన వరి కోతలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట కోతలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మండలంలో సుమారు 12వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, చెరువులు, బోరు బావుల కింద సాగు చేసిన పంటలు చేతికి రానున్నాయి. జూన్ నెలలో నాట్లు వేసిన పైరు ప్రస్తుతం గింజ పట్టిపడే దశకు చేరుకుంది. ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన రైతు గోపాల్ రావు, ఠాణాకలాన్ శివారులో తన అర ఎకరం పొలంలో సాగు చేసిన ఆర్‌టిఆర్ 1162 రకం వరి పంటలను హార్వెస్టర్ మిషన్‌తో నూర్పిడి చేసి, మండలంలోనే తొలి కోతను ప్రారంభించారు. ఈ ధాన్యాన్ని విత్తన అవసరాల కోసం నిల్వ ఉంచనున్నట్లు ఆయన తెలిపారు.

# త్వరలోనే ట్రస్మా నూతన కార్యవర్గం

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా ట్రస్మా నూతన కార్యవర్గాన్ని త్వరలోనే పారదర్శకంగా ఎన్నుకోనున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపల్లి కిషన్ రావు తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని విద్యాధరి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–26 కార్యవర్గ పదవీ కాలం ముగిసిందని, పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు పి. దేవభూషణం, ప్రధాన కార్యదర్శి వి. తిరుపతి చారి బృందాన్ని అభినందించారు. సమావేశంలో ట్రస్మా నాయకులు పి. దేవభూషణం, వి. తిరుపతి చారి, పి. నరేందర్, ఇప్పా పోచయ్య, అలుగుల తిరుపతి, కృష్ణ ప్రసాద్, కుకుడే సంతోష్, రాధాకృష్ణ చారి, రాజన్న పాల్గొన్నారు.

## నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్రజాపక్షం/వీర్నపల్లి: మండల పరిధిలో జరిగే వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలు దరూ ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు లేకుండా అత్యంత సంతోషంగా, పండగ వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక ఎస్ఐ వేముల లక్ష్మణ్ అన్నారు. ముఖ్యంగా నిమజ్జనం చేసే సమయంలో చెరువులు, కుంటలు వద్ద ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలకు తావివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వేడుకల్లో డీజే సౌండ్ సిస్టమ్స్ వాడకానికి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా డీజేలు ఏర్పాటు చేస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. భక్తులందరూ నిబంధనలకు సహకరించి, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించాలని కోరారు. అనంతరం స్థానిక ఎంపిడిఓ శ్రీలేఖతో కలిసి మండల కేంద్రంలో జరిగే వినాయక నిమజ్జనానికి సంబంధించిన వెంటకరాయిని చెరువుని పరిశీలించారు. నిమజ్జనానికి కావల్సిన ముందు జాగ్రత్తలు, ఏర్పాట్లపై గ్రామ కార్యదర్శికి, పంచాయతీ సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

## వైభవంగా కుంకుమ పూజలు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని రెండో వార్డు ఎస్టీ కాలనీ గణపతి మండపం వద్ద కుంకుమ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఓడేడ్ మాజీ ఎంపిటిసి ముఖ్య అతిథులుగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమంలో ఐలాపురం కుమారస్వామి,జంగ మొండయ్య, రాజేందర్,బొడ్డ గణేష్, భీముని నగేష్ తోపాటు గిరిజన కులస్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అలాగే ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో కుంకుమ పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది.వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలోని వినాయకుని వద్ద పురోహితుల ఆధ్వర్యంలో కుంకుమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ పూజలో గ్రామానికి చెందిన మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అకోజ్ అశోక్ చారి, చక్రపాణి,మధుకర్,నతీష్ తోపాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడికి విశేష పూజలు

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విఘ్నేశ్వరుడికి నారికేళాభిషేకం, సువర్ణ పుష్పార్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు.మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కోట సుమన్,చాడ చంద్రకుమార్,దొంతుల సంతోష్, మంచాల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం

డిహెచ్ఎస్ఒ అబ్దుల్ నదీం



ప్రజాపక్షం / కాగజ్ నగర్ : ఆయిల్ పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా నిరంతర ఆదాయం లభిస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి (డిహెచ్ఎస్ఒ) అబ్దుల్ నదీం తెలిపారు. ఒక్కసారి మొక్కలు నాటితే దాదాపు 30 ఏళ్ల పాటు స్థిరమైన దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. కాగజ్ నగర్ మండలంలోని కోస్నిగ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం 108వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగుకు 90 శాతం సబ్సిడీ అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్ పామ్ సాగులో విశేష అనుభవం కలిగిన ఆదర్శ రైతు గుంటపల్లి రామ్మోహన్ రావు తన విజయగాథను తోటి రైతులతో పంచుకున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. సంప్రదాయ పంటలకు భిన్నంగా ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తుందని డిఎఒ వెంకట్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారిణి చి. సుప్రజ, వ్యవసాయ అధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# విద్యతోనే అభివృద్ధి సాధ్యం



ప్రజాపక్షం/జైపూర్ : విద్యతోటే సమాజ అభివృద్ధి సాధ్యమని, అది కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాకారమవుతుందని జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వంభర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. జైపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఉదయం పూట తిండి లేక రక్తహీనత, బరువు తగ్గడం వంటి సమస్యలతో చదువులో వెనుకబడుతున్నారని తెలిపారు. ఉదయాన్నే పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడి చదువు, క్రీడలపై శ్రద్ధ పెరుగుతుందని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాల వివరాలను తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైపూర్ తహసీల్దార్ వనజా రెడ్డి, ఎంపిడిఓ శ్రీపతి బాపురావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# పంట కుంట పనుల్లో నాణ్యత పాటించాలి

ఎంపిడిఓ రాజేశ్వర్



ప్రజాపక్షం/మండమర్రి : నిర్దేశిత లక్ష్యాల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పంట కుంటల నిర్మాణం పూర్తి చేయాలని ఎంపిడిఓ రాజేశ్వర్ సూచించారు. మందమర్రి మండలంలోని అదిలోపేట గ్రామంలో కొనసాగుతున్న పంట కుంట (ఫారం పాండ్) నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతి, కూలీల హాజరు, నిర్మాణ తీరుపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటూ వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పంట కుంటల నిర్మాణం వల్ల వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచవచ్చని, రైతులకు సాగునీటి లభ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. నీటి సంరక్షణ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పున్నం నెందుగురి, సాంకేతిక సహాయకుడు కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ బాపురావు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు

మైలారం రాము, మస్తాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

ప్రజాపక్షం/ వేములవాడ టౌన్: ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొలువుదీర్చిన గణనాథుని మండపం వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, సహస్రనామార్చనలు, ధూపదీప నైవేద్యాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైలారం రాము, మస్తాన్‌ల పర్యవేక్షణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక నైవేద్యం సమర్పించిన అనంతరం, విచ్చేసిన వేలాది మంది భక్తులకు నేతలు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించి తమ భక్తిపారవశ్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మైలారం రాము, మస్తాన్ మాట్లాడుతూ.. బొజ్జ గణపయ్య దివ్య కృపాకటాక్షాలతో, శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆశీస్సులతో స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆయురారోగ్యాలతో నిరంతరం ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ఆది శ్రీనివాస్ సేవలను గుర్తించి, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆయనకు త్వరలోనే మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఎలాంటి ఆపదలు లేకుండా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని విఘ్నేశ్వరుని వేడుకున్నామని పేర్కొన్నారు. అన్నదానం వంటి పవిత్ర కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంచుతాయని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన కాంగ్రెస్ శ్రేణులకు, ప్రసాదం స్వీకరించిన భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూము మధు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దూలం భూమేష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, పులి రాంబాబు గౌడ్, చిలక రమేష్, ఇప్పపూల అజయ్, ముంజ ఉమేందర్, మూడపల్లి నాగరాజు, మర్రిపల్లి రాజులతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పూర్తి



ప్రజాపక్షం/ముత్తారం : మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ముగింపు ముగిసింది.శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చిలివేరి జ్యోతి లక్ష్మణ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తాళ్లపల్లి కుమార్ స్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు వారు చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వాలంబన సాధించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా,కేషపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెగడ తిరుమల కుమార్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు,మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

## వైభవంగా అన్నదాన కార్యక్రమం

ప్రజాపక్షం/ వేములవాడ టౌన్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మున్సిపల్ పాలకవర్గం అత్యంత వైభవంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్యం రాజు పాల్గొని, స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఉత్సవాల సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, పాలకవర్గ సభ్యులు, అధికారులు, స్థానిక ప్రముఖులు సమిష్టిగా ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్యం రాజు మాట్లాడుతూ... గణపతి నవరాత్రి ఉత్సవాలను నిష్టతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడమే కాకుండా, ప్రతిరోజూ ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమైన కార్యమని వ్యాఖ్యానించారు. పట్టణంలో యువత అత్యంత ఉత్సాహంగా ముందుకు వచ్చి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు విరివిగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. నేటి యువతలో సేవాభావం మరింతగా పెంపొందితే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని, కష్టాల్లో ఉన్నవారికి చేయూతనందించే గుణం అలవడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పండుగల ద్వారా లభించే ఐక్యత, సోదరభావం సమాజ వికాసానికి తోడ్పడతాయని తెలిపారు. నవరాత్రి ఉత్సవాల వేళ పట్టణ ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో వేడుకలను జరుపుకోవాలని, స్వామి వారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకున్నారు. మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మరిన్ని ప్రజా ఉపయోగకరమైన, సేవా దృక్పథంతో కూడిన కార్యక్రమాలను ముున్ముందు కూడా విస్తృతంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా చైర్మన్ పుల్యం రాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, గౌరవ కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, పాత్రికేయ మిత్రులు, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## పోషణ్ మాసోత్సవంపై అవగాహన



ప్రజాపక్షం/ఎల్లారెడ్డి–పేట: మండలంలోని పదిర,నారాయణపురం గ్రామాలలో తొమ్మిదో జాతీయ పోషణ్‌మాసోత్సవం సందర్భంగా తల్లులకు,గర్భిణులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.మాతశిశు సంరక్షణ అధ్వర్యంలో సెప్టెంబర్ తొమ్మిది నుండి అక్టోబర్ వరకు జరిగే మాసోత్సవాలలో భాగంగా మంగళవారం సరియైన పోషకాహారంపై అంగన్వాడి కేంద్రాలలో టీచర్లు అవగాహన కల్పించారు.ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై వివరించారు. ప్రతి ఇంటికి పోషకాహారం ,తాగునీరుపై సమాచారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు,అంగన్వాడి టీచర్లు, గర్భిణులు ,పిల్లలు ఉన్నారు.